

సామాన్యుడి గళం

విజన్ పక్షం

PRGI.TGBIL/26/A0206

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్,సంపుటి : 01,సంచిక : 113, చీఫ్ ఎడిటర్ : ఎల్గని రాజేశ్వర్ గౌడ్,తేదీ : 18-09-2026,పేజీలు :04, వెల: 02 రూ/-

తిరుమల చేరుకున్న ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్.. రేపు శ్రీవారి దర్శనం

తిరుమల పర్యటనకు విచ్చేసిన ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్

రేపు ఉదయం శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకోనున్న గవర్నర్

తిరుమలలో గవర్నర్‌కు స్వాగతం పలికిన టీటీడీ చైర్మన్, ఈవో

రేణిగుంట విమానాశ్రయంలో స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్, ఎస్పీ



అమరావతి : ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ గురువారం తిరుమల చేరుకున్నారు. శ్రీవారి దర్శనార్థం తిరుమల విచ్చేసిన ఆయనకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. గవర్నర్ శుక్రవారం ఉదయం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోనున్నారు. వివరాల్లోకి వెళితే, గురువారం సాయంత్రం తిరుమలలోని శ్రీభాగ్య విశ్రాంతి భవనానికి చేరుకున్న గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు, కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎం. రవిచంద్ర, సీవీఎస్‌వో మురళీకృష్ణ పుష్పగుచ్ఛం అందించి సాదరంగా స్వాగతించారు. మిగతా..2లో

చరిత్రను ఎవరూ దాచిపెట్టలేరు: రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి ఫైర్

తెలంగాణ విమోచన దినోత్సవం వేడుకల్లో పాల్గొన్న కిషన్ రెడ్డి

రజాకార్ల ఘోరాలను గత పాలకులు తొక్కిపెట్టారని మండిపాటు

ఎంఐఎంకు అనుకూలంగా రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని విమర్శ



హైదరాబాద్: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన 'తెలంగాణ విమోచన దినోత్సవం' వేడుకల్లో భారత ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలపై విరుచుకుపడ్డారు. తెలంగాణలో రజాకార్లు జరిపిన నరమేధం, ఘోరాలను గత పాలకులు చరిత్ర పుటల నుంచి తొక్కిపెట్టారని మండిపడ్డారు. చరిత్రను ఎంత దాచాలని చూసినా సత్యం దాగిపోదని స్పష్టం చేశారు. ఎంఐఎంకు భయపడే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడానికి వెనుకాడాయని ఆరోపించారు. మిగతా..2లో

ఖైరతాబాద్ గణపతికి ప్రత్యేక పూజలు చేసిన హరీశ్ రావు.. పర్యావరణహిత వేడుకలపై ప్రశంసలు



- బడా గణేశ్ ను దర్శించుకున్న హరీశ్, తలసాని, కాలేరు వెంకటేశ్
- ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించాలన్న హరీశ్ రావు
- నిమజ్జన ఘట్టంలో అప్రమత్తంగా ఉండాలని సూచన

హైదరాబాద్: భాగ్యనగరం నడిబొడ్డున కొలువైన ప్రపంచ ప్రసిద్ధ ఖైరతాబాద్ పంచముఖ సంకట మహాగణపతిని బీజేపీ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు దర్శించుకున్నారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సహా బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో

కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై ప్రభుత్వ దృష్టి.. రంగంలోకి రెవెన్యూ అధికారులు

- కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై ప్రభుత్వం చర్యలు
- సమీపంలోని ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారుల ఆరా
- సర్వే నంబర్లు, పాత రికార్డుల సేకరణ
- అసెంబ్లీలో సీఎం రేవంత్ ప్రకటనతో కదలిక



హైదరాబాద్ : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఫామ్‌హౌస్ భూములపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ఫామ్‌హౌస్‌కు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల సర్వే నంబర్లు, గతంలో ఆ భూములను సాగు చేసిన రైతుల పేర్లు, ప్రస్తుత భూ రికార్డుల వివరాలతో అధికారులు సమగ్ర నివేదికలను రూపొందిస్తున్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకటనకు అనుగుణంగానే అధికారులు ఇప్పుడు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంపై దృష్టి పెట్టారు. మిగతా..2లో

కేసీఆర్, కుటుంబ ఆస్తులపై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు..

తీవ్రంగా స్పందించిన కేటీఆర్



- కేసీఆర్‌కు 1,000 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందనడంపై కేటీఆర్ ఆగ్రహం
- మాజీ సీఎంకు ఉన్నది 67 ఎకరాలేనని స్పష్టం
- పుట్టుక నుంచి తమ ఆస్తులపై విచారణకు సిద్ధమని ప్రకటన
- మీ ఆస్తులపైనా విచారణకు సిద్ధమా అంటూ రేవంత్‌కు సవాల్
- సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్

ట్రంప్ తనయులకు సంబంధించిన కంపెనీతో పాక్ డీల్..

- యూఎస్‌కు చెందని డ్రోన్ తయారీ సంస్థ పవర్‌అజ్‌తో డ్రోన్ సరఫరా కోసం పాక్ ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.
- బుధవారం సంస్థ సహ వ్యవస్థాపకుడు బ్రెట్ వెలికోవిచ్ అంతర్జాతీయ మీడియాతో ఈ విషయాన్ని పంచుకున్నారు.



ఢిల్లీ : యూఎస్‌కు చెందని డ్రోన్ తయారీ సంస్థ పవర్‌అజ్‌తో డ్రోన్ సరఫరా కోసం పాక్ ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. సంస్థ సహ వ్యవస్థాపకుడు బ్రెట్ వెలికోవిచ్ తాజాగా అంతర్జాతీయ మీడియాతో ఈ విషయాన్ని పంచుకున్నారు. బుధవారం ఆయన పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌తో సమావేశమయ్యారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనయులు ట్రంప్ జూనియర్, ఎరిక్ ట్రంప్‌లకు వాటాలున్న ఆరియస్ గ్రీన్‌వే హోల్డింగ్స్ అనే సంస్థలో పవర్‌అజ్ త్వరలో విలీనం కానున్న నేపథ్యంలో ఈ డీల్‌కు ప్రాధాన్యం ఏర్పడింది. అయితే, ఎన్ని డ్రోన్స్‌ను సరఫరా చేస్తారు? డీల్ విలువ ఎంత? అనే వివరాలను మాత్రం వెలికోవిచ్ వెల్లడించలేదు. పాక్‌తో కలిసి సంయుక్తంగా ఓ జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయడం తమ దీర్ఘకాలిక లక్ష్యమని వెలికోవిచ్ తెలిపారు.

ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్‌గా తవెంగ్వా ముకులాని.. చరిత్రలో తొలిసారిగా జింబాబ్వేకు అవకాశం



- అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్‌లో కీలక మార్పు
- ఐసీసీ కొత్త డిప్యూటీ ఛైర్మన్‌గా టవెంగ్వా ముకులానీ నియామకం
- ఈ పదవి చేపట్టిన తొలి జింబాబ్వే వ్యక్తిగా రికార్డు
- 2027 ప్రపంచకప్ నేపథ్యంలో ఈ నియామకానికి ప్రాధాన్యత

సెమీకండక్టర్ గ్లోబల్ హబ్‌గా భారత్ ఆవిష్కరణలు, పెట్టుబడులకు కొత్త అవకాశాలు

- వేగంగా పెరుగుతున్న మౌలిక వసతులతో లాజిస్టిక్స్, తయారీ రంగాలకు కొత్త బలంగా మారిందన్న ప్రధాని
- భారత్‌లో తయారవుతున్న చిప్‌లు దేశంతో పాటు ప్రపంచ మార్కెట్లకు చేరుతున్నాయన్న మోదీ



ఢిల్లీ : సెమీకండక్టర్ రంగంలో భారత్ శరవేగంగా ముందుకు వెళ్తోందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ప్రపంచ చిప్ తయారీకి కొత్త, నమ్మకమైన కేంద్రాల అవసరం పెరుగుతున్న సమయంలో భారత్ గ్లోబల్ హబ్ గా సిద్ధమవుతోందని చెప్పారు. దేశంలో సెమీకండక్టర్ వ్యవస్థ వేగంగా విస్తరిస్తోందని, దీంతో ఆవిష్కరణలు, పెట్టుబడులు, ఆర్థిక వృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. దిల్లీలో గురువారం ప్రారంభమైన సెమికాన్ ఇండియా 2026 ఐదో ఎడిషన్‌లో ప్రధాని పాల్గొని ప్రసంగించారు.

చిప్ తయారీకి భారత్

సెమీకండక్టర్ తయారీకి ప్రపంచ దేశాలు కొత్త, విశ్వసనీయ ప్రాంతాలను వెతుకుతున్నాయని మోదీ చెప్పారు. భారత్ కూడా చిప్ తయారీకి ప్రాధాన్య కేంద్రంగా ఎదిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. తయారీదారులు విజయవంతం కావడానికి అవసరమైన విధానాలు, నిబంధనలు, మౌలిక సదుపాయాలపై

పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు



- డీఎస్సీ నియామకాలపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని అనిత మండిపాటు
- డీఎస్సీ పూర్తయిన ఏడాది తర్వాత బురద చల్లుతున్నారని ఆగ్రహం
- వాస్తవాలు ఏమిటో ప్రజలకు తెలుసని వ్యాఖ్య

అమరావతి : ఏపీలో డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత,

టెక్నాలజీని అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని మోదీ భారత్ అభివృద్ధిని ఎవరూ ఆపలేరు



- మోదీ 25 ఏళ్ల ప్రజాప్రస్థానంపై కాశీలో 'సేవా సంకల్ప్ అభియాన్ ' కార్యక్రమం చేపట్టారు.
- వారణాసిలో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.
- వారణాసిలోని కాశీ విశ్వనాథ్ ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు.
- వారణాసిలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన

అమరావతి : నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ పుట్టినరోజు, అలాగే మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని వారణాసిలో నిర్వహించిన 'సేవా సంకల్ప్ అభియాన్ ' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ అందించిన సేవలను స్మరించుకుంటూ దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా 'వారణాసివాద్యగర్ సేవా యాత్ర చేపట్టారు. ప్రధాని మోదీ ప్రజా జీవితంతో ప్రత్యేక అనుబంధం ఉన్న వారణాసి, వాద్యగర్ ను అనుసంధానిస్తూ నిర్వహించే ఈ యాత్రలో యువత, ప్రజాప్రతినిధులు, సేవా ప్రతినిధులు భాగస్వాములు పాల్గొన్నారు. దేశ అభివృద్ధిలో ప్రజా భాగస్వామ్యం, సేవా భావం, సామాజిక బాధ్యత ప్రాధాన్యతను చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుగా శ్రీ కాశీ విశ్వనాథుడిని దర్శించుకుని, అనంతరం రుద్రాక్ష్ అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ లో సేవా యాత్ర ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానంపై కాశీలో 'సేవా సంకల్ప్ అభియాన్ ' కార్యక్రమం చేపట్టారు. వారణాసిలో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వారణాసిలోని మిగతా..2లో

రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం

కూటమి ప్రభుత్వంపై జగన్ ధ్వజం



- రాష్ట్రంలో కరవు పరిస్థితులపై జగన్ ఆందోళన
- ఈ ఖరీఫ్‌లో సాగు 56.4 లక్షల ఎకరాలకే పరిమితమయిందన్న జగన్
- రైతులను నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమవుతున్న కరవు, వర్షాభావ పరిస్థితులపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రీజనల్ కో-ఆర్డినేటర్లు, మిగతా..2లో

సామాన్యుడి గళం
విజన్ పక్షం
PRGI.TGBIL/26/A0206
శుక్రవారం
18-09-2026

మొదటి పేజి తరువాయి

పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు

టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పూర్తయి ఏడాది గడిచిన తర్వాత, కూటమి ప్రభుత్వంపై బురద చల్లేందుకు వైసీపీ నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని అనిత మండిపడ్డారు. వైసీపీ అధినేత జగన్ పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధారమైన వ్యాఖ్యలు చేయడం అలవాటుగా మార్చుకున్నారని, అసలు వాస్తవాలు ఏమిటో ప్రజలకు స్పష్టంగా తెలుసని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే వీరికి తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. మరోవైపు, ఏపీపీఎస్సీ కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే వైసీపీ ఈ రాద్ధాంతం చేస్తోందని అప్పసాని రాజేశ్ ఆరోపించారు. డీఎస్సీ నియామకాలను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు వేసిన 320 కేసులను న్యాయస్థానం కొట్టివేసిందని గుర్తు చేశారు. గత ఐదేళ్ల పాలనలో 'జాబ్‌లెస్ క్యాలెండర్'తో యువతను మోసం చేసిన జగన్, ఇప్పుడు అత్యంత పారదర్శకంగా జరిగిన డీఎస్సీపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై ప్రభుత్వ దృష్టి..
రంగంలోకి రెవెన్యూ అధికారులు

కేసీఆర్ భూముల విస్తీర్ణం, వాటి స్వరూపంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం కొనసాగుతున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఖైరతాబాద్ గణపతికి ప్రత్యేక పూజలు చేసిన హరీశ్ రావు.. పర్యావరణహిత వేడుకలపై ప్రశంసలు

కలిసి ఆయన స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి, ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ... చార్మినార్, గోల్కొండ కోటల మాదిరిగానే హైదరాబాద్ అంతర్జాతీయ బ్రాండ్ ఇమేజ్‌ను నలుదిశలా సగర్వంగా చాటడంలో ఖైరతాబాద్ వినాయకుడి ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. కేవలం పరిమాణంలోనే కాక, భక్తుల నమ్మకంలోనూ ఇది 'బడియా గణేశ్'గా నిలిచిందని అభివర్ణించారు. ఈ ఏడాది 69 అడుగుల భారీ ఎత్తులో పూర్తిగా మట్టితో రూపుదిద్దుకున్న పంచముఖ సంకట మహాగణపతిని ప్రతిష్ఠించి ఉత్సవ కమిటీ పర్యావరణ పరిరక్షణకు గొప్ప సందేశమిచ్చిందని ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణానికి ముప్పు లేని మట్టి వినాయకులనే పూజించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. మరోవైపు ఉత్సవాలను ఎంత వైభవంగా నిర్వహిస్తున్నామో, నిమజ్జన ఘట్టంలోనూ అంతే అప్రమత్తత అవసరమని నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల పటాన్‌చెరు పరిధిలో నిమజ్జనం సమయంలో చోటుచేసుకున్న విషాదకర సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఇలాంటి అవాంఛనీయ ఘటనలు ఎక్కడా పునరావృతం కాకుండా ముందస్తుగా ప్రభుత్వ యంత్రాంగం, ఉత్సవ సమితులు సమన్వయంతో పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు, భక్తులకు స్వామివారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆయన కోరుకున్నారు.

ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్‌గా తవెంగ్వా ముకులాని.. చరిత్రలో తొలిసారిగా జింబాబ్వేకు అవకాశం

ఢిల్లీ : అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కొత్త డిప్యూటీ ఛైర్మన్‌గా జింబాబ్వేకు చెందిన తవెంగ్వా ముకులాని నియమి తులయ్యారు. ఐసీసీ బోర్డు డైరెక్టర్లు ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటివరకు ఈ పదవిలో ఉన్న ఇమ్రాన్ ఖ్వాజా స్థానంలో ముకులానీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన ఈ పదవిలో 2027 నవంబర్ వరకు కొనసాగుతారు. ఈ నియామకంతో ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్ పదవిని అలంకరించిన తొలి జింబాబ్వే వ్యక్తిగా ముకులాని చరిత్ర సృష్టించారు. ప్రస్తుతం ముకులాని జింబాబ్వే క్రికెట్ బోర్డు ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఐసీసీలో జింబాబ్వే ప్రతినిధిగా ఉండటంతో పాటు, ఫైనాన్స్ అండ్ కమర్షియల్ అఫైర్స్ నామినేషన్స్ కమిటీలలో సభ్యుడిగా, హెచ్ఆర్ అండ్ రెమ్యూనరేషన్ కమిటీకి హెడ్ గానూ పనిచేస్తున్నారు. దక్షిణాఫ్రికా, నమీబియాలతో కలిసి 2027 ఐసీసీ పురుషుల క్రికెట్ ప్రపంచకప్‌కు జింబాబ్వే సహ-ఆతిథ్యం ఇవ్వనున్న తరుణంలో ముకులాని నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది. దాదాపు 24 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రపంచకప్ మళ్లీ ఆఫ్రికాకు తిరిగి వస్తున్న వేళ, ఆయన అనుభవం ఐసీసీకి కీలకం కానుంది. ఈ సందర్భంగా ముకులాని మాట్లాడుతూ.. "నాపై నమ్మకం ఉంచిన ఐసీసీ బోర్డు డైరెక్టర్లకు కృతజ్ఞతలు. ఐసీసీ ఛైర్మన్ జై షా నాయకత్వంలో పనిచేయడానికి ఎదురుచూస్తున్నాను. ఆయన మార్గదర్శకత్వంలో క్రికెట్‌ను మరింతగా విస్తరించేందుకు కృషి చేస్తాను. ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనం వంటి ఉత్తేజకరమైన ఈ సమయంలో, ప్రపంచ క్రికెట్ ప్రయోజనాల కోసం పనిచేస్తాను" అని తెలిపారు. ఐసీసీ ఛైర్మన్ జై షా స్పందిస్తూ.. "డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికైన తవెంగ్వా ముకులానీకి అభినందనలు. క్రికెట్ పరిపాలనలో ఆయన అనుభవం, ప్రపంచ ఆటపై ఆయనకున్న అవగాహన ఐసీసీ బోర్డుకు అమూల్యమైనవి. ఆయన నియామకం జింబాబ్వేకు ఒక చారిత్రక మైలురాయి. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్‌ను బలోపేతం చేయడానికి ఆయనతో కలిసి పనిచేస్తాను" అని పేర్కొన్నారు.

ట్రంప్ తనయులకు సంబంధించిన కంపెనీతో పాక్ డీల్..

పాక్‌లో ప్రైవేటు డిఫెన్స్ సంస్థలు ఇంకా శైశవ దశలో ఉన్నందుకు తమ లాంటి సంస్థల అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఇక పాక్‌లో డిఫెన్స్ ఉత్పత్తుల తయారీకి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని కూడా వెలికోవిచ్ తెలిపారు. ఈ డీల్ వెనుక ట్రంప్ కుటుంబం ఇన్‌ఫ్లుయెన్స్ ఉందన్న వాదనలను సంస్థ సీఈఓ ఫాక్స్ కొట్టిపారేశారు. కేవలం తమ ప్రతిభ, గుర్తింపు ఆధారంగా పాక్ నుంచి ఈ కాంట్రాక్ట్ దక్కించుకున్నామని చెప్పారు. తమ కంపెనీ రోజువారీ కార్యకలాపాలు, నిర్వహణలో ట్రంప్ తనయులు పాలుపంచుకోరని స్పష్టం చేశారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, అమెరికన్ వెంచర్స్ అనే ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ ద్వారా ట్రంప్ సోదరులు ఆరియస్ సంస్థలో పెట్టుబడి పెట్టారు. ఆరియస్, పవర్‌అజ్ విలీనం తరువాత సంస్థలో ట్రంప్ సోదరుల వాటా 9.9 శాతంగా ఉంటుందని సమాచారం. ఈ పరిణామాలపై డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ప్రతినిధి స్పందించారు. ట్రంప్ జూనియర్ కేవలం పెట్టుబడిదారుగా మాత్రమే ఉన్నారని అన్నారు. కంపెనీ నిర్వహణ, కాంట్రాక్ట్‌లు వంటి విషయాలతో ఆయనకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ ఉదంతంపై ఎరిక్ ట్రంప్ ఇంకా స్పందించాల్సి ఉంది.

తిరుమల చేరుకున్న ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్.. రేపు శ్రీవారి దర్శనం

ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు నరేశ్, రిసెప్షన్ అధికారులు భాస్కర్, సాత్రే నాయక్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు, రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న గవర్నర్‌కు జిల్లా ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు విమానాశ్రయంలో గవర్నర్‌కు స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్ రోడ్డు మార్గంలో తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

చరిత్రను ఎవరూ దాచిపెట్టలేరు: రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి ఫైర్

సీఎం రేవంత్ రెడ్డి సైతం ఎంఐఎంకు అనుకూలంగా ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా నిజాం పాలకులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పొగడటాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. "నిజాం నిజంగానే మంచివాడైతే తెలంగాణ విమోచన కోసం సాయుధ పోరాటాలు ఎందుకు చేయాల్సి వచ్చింది? 'ఆపరేషన్ పోలో' ఎందుకు చేపట్టాల్సి వచ్చింది?" అని నిలదీశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న ఈ తరహా ఓటు బ్యాంక్ రాజకీయాలకు రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఛార్జీల విషయంలో అమెరికా ఒత్తిడి ఉందా?

యూపీఐపై కొత్తగా తీసుకొచ్చిన 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్-ఎండీఆర్ నిర్ణయం ఇప్పుడు రాజకీయంగా చర్చకు దారితీసింది. ఆ ఛార్జీల నిర్ణయం వెనుక అమెరికా ఒత్తిడి ఉందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కేంద్ర ఆర్థిక శాఖ ఖండించింది. ఇందులో ఎలాంటి విదేశీ ఒత్తిడి లేదని స్పష్టం చేసింది. అంతర్జాతీయ క్రెడిట్ కార్డులకు యూపీఐలో అవకాశం కల్పించేందుకే ఆ నిర్ణయం తీసుకున్నారన్న వాదనలో నిజం లేదని తెలిపింది.

అమెరికా కార్డులకు ప్రయోజనం ఏంటి?

యూపీఐలో క్రెడిట్ లావాదేవీలకు ప్రస్తుతం రూపే క్రెడిట్ కార్డులకు మాత్రమే అవకాశం ఉందని ఆర్థిక శాఖ ఆధ్వర్యంలోని ఫైనాన్షియల్ సర్వీసెస్ విభాగం-ఐఖీు స్పష్టం చేసింది. సెప్టెంబర్ 15న ఎన్‌పీసీఐ విడుదల చేసిన తాజా సర్క్యులర్‌లో కూడా ఇదే విధానం ఉందని తెలిపింది. ఇతర దేశాలకు చెందిన క్రెడిట్ కార్డులను యూపీఐ క్రెడిట్ లావాదేవీలకు అనుసంధానం చేసే అవకాశం ఇవ్వలేదని పేర్కొంది. అందువల్ల 0.4 శాతం ఎండీఆర్ నిర్ణయం అమెరికా క్రెడిట్ కార్డు సంస్థలకు ప్రయోజనం కల్పించేందుకు తీసుకున్నదనే ఆరోపణకు ఆధారం లేదని కేంద్రం చెబుతోంది. యూపీఐలో రూపే క్రెడిట్ కార్డులను వినియోగదారులకు ప్రధాన ఎంపికగా మార్చడమే తమ విధానమని ఐఖీు తెలిపింది. అమెరికా ఎలక్ట్రానిక్ చెల్లింపుల సంస్థలకు యూపీఐలో సమాన అవకాశాలు లేవంటూ అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం-యూఎస్‌టీఆర్ 2026 నివేదికలో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కేంద్రం వివరణ ఇచ్చింది. ఎన్‌పీసీఐ ప్రకారం, ఎంపిక చేసిన అధిక విలువైన యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ తీసుకురావడం వెనుక ప్రధాన కారణం డిజిటల్ చెల్లింపుల వ్యవస్థకు ఆదాయ నమూనా కల్పించడమే. యూపీఐలో ప్రస్తుతం పెద్ద సంస్థల ఆధిపత్యం ఎక్కువగా ఉందని కేంద్రం చెబుతోంది. 2020లో థర్డ్ పార్టీ యాప్ ప్రొవైడర్లకు 30 శాతం మార్కెట్ వాటా పరిమితిని ఎన్‌పీసీఐ తీసుకొచ్చింది. అయితే చిన్న కంపెనీలు మార్కెట్లో పెద్ద సంస్థలతో పోటీ పడేందుకు తగిన ఆదాయ మార్గం లేకపోవడంతో ఆ పరిమితిని అమలు చేయడం కష్టంగా మారిందని తెలిపింది. ఎంపిక చేసిన అధిక విలువ లావాదేవీలపై ఎండీఆర్ విధించడం ద్వారా చిన్న సంస్థలకు కూడా ఆదాయ మార్గం ఏర్పడుతుందని

టెక్నాలజీని అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని మోదీ - భారత్ అభివృద్ధిని ఎవరూ ఆపలేరు: చంద్రబాబు

మొదటి పేజి తరువాయి

కాశీ విశ్వనాథ్ ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. రక్షణమంత్రి రాజ్ నాథ్, కేంద్రమంత్రులు చిరాగ్ పాసవాన్, పంకజ్ చౌదరి, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తో కలిసి సీఎం చంద్రబాబు ఆలయంలో పూజలు నిర్వహించారు. 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు : అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడారు, "ఇండియా అభివృద్ధి చెందిన దేశంగా మారబోతుంది. భారత్ అభివృద్ధిని ఎవరూ ఆపలేరు. సానుకూల దృక్పథం ఉంటే ఉన్నతస్థానాలకు వెళ్లగలరు. దేశంలో 80 కోట్ల మందికి ఉచిత రేషన్‌బియ్యం పంపిణీ జరుగుతుంది. ప్రధాని మోదీ పాలనలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. ప్రతి పేదవాడికి తాగునీరు అందించాలనేదే ప్రధాని లక్ష్యం. సుమారు 11 కోట్లమంది పీఎం కిసాన్ ద్వారా లబ్ధి పొందుతున్నారు. మధ్యవర్తులు లేకుండా రైతుల ఖాతాల్లోనే డబ్బులు జమ చేస్తున్నారు. కొవిడ్



సంక్షోభంలోనూ ప్రధాని మోదీ మంచి పాలన అందించారు. కొవిడ్ సమయంలో 140 కోట్ల మందిని ప్రధాని మోదీ కాపాడారు. ప్రధాని మోదీ ఉచితంగా దేశ ప్రజలకు కొవిడ్ వ్యాక్సిన్లు వేశారు. ప్రపంచంలోని 101 దేశాలకు ప్రధాని మోదీ కొవిడ్ వ్యాక్సిన్లు పంపారు. గతంలో భారత్ ఆయుధాలను దిగుమతి చేసుకునేది, ప్రస్తుతం భారత్‌లోనే ఆయుధాల ఉత్పత్తి జరుగుతుంది. టెక్నాలజీని అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని మోదీనే. మహిళలే కేంద్రంగా దేశంలో అభివృద్ధి జరుగుతుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. "మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు చట్టం చేశారు. బేటీ బచావో బేటీ పడావో, ఉజ్వల సహా తదితర పథకాల ద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతోంది. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు చట్టం చేశారు. భారత్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే ఏం జరుగుతోందో ప్రధాని చూపించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ సత్తాను ప్రధాని మోదీ ప్రపంచానికి చూపించారు. దేశంలో తీవ్రవాదం లేకుండా ప్రధాని మోదీ చర్యలు చేపట్టారు. ప్రధాని మోదీ చర్యల వల్ల దేశంలో తీవ్రవాదం అంతమైంది. సుదీర్ఘకాలం నలిగిన అయోధ్య సమస్యను ప్రధాని పరిష్కరించారు. అయోధ్యలో వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మిస్తాం.

రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం: కూటమి ప్రభుత్వంపై జగన్ ధ్వజం

మొదటి పేజి తరువాయి

జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లాల వారీగా పరిస్థితులపై సమీక్ష జరిపారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో 51 శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైందని, మొత్తం 688 మండలాల్లో 628 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా కూటమి ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఖరీఫ్‌లో సాధారణంగా 76 లక్షల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా కేవలం 56.4 లక్షల ఎకరాలకే పరిమితమైందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనం వేయలేకపోయిన రైతులకు ఎకరాకు రూ.15,000, పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.25,000 చొప్పున ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి పాత బకాయిలైన రూ.3,000 కోట్లను విడుదల చేయాలన్నారు. ఒక్కో రైతుకు అన్నదాత సుఖీభవ కింద పెండింగ్‌లో ఉన్న రూ.41,000 చెల్లించాలని సూచించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.6,000 కోట్లు అందించాలన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని తరలించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. సాగునీటి రంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును తప్పుబడుతూ, పోలవరం నిల్వ సామర్థ్యంపై రాజీపడుతూ ఉనికి కోసం లిఫ్ట్ ప్రాజెక్టులతో డ్రామాలు ఆడుతున్నారని జగన్ విమర్శించారు. కరవు బారిన పడిన గ్రామీణ ప్రాంత ప్రజల కోసం అదనంగా 150 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, తాగునీటి ఎద్దడి నివారణకు ఉచిత ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైసీపీ క్షేత్రస్థాయి కార్యాచరణ



చేపడుతుందని, త్వరలోనే తాను స్వయంగా కరవు ప్రాంతాల్లో పర్యటించి రైతులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు.


సెమీకండక్టర్ గ్లోబల్ హబ్‌గా భారత్
ఆవిష్కరణలు, పెట్టుబడులకు కొత్త అవకాశాలు

మొదటి పేజి తరువాయి

ప్రభుత్వం దృష్టి పెట్టిందని తెలిపారు. ఇప్పటికే దేశంలో 12 చిప్ తయారీ ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని ప్రధాని వెల్లడించారు. రానున్న దశలో ఈ సంఖ్య మరింత పెరుగుతుందని చెప్పారు. చిప్ డిజైన్, అసెంబ్లీకి మాత్రమే పరిమితం కాకుండా, చిప్ తయారీ, అధునాతన ప్యాకేజింగ్, పరికరాలు, ముడి పదార్థాలు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి వంటి అన్ని రంగాలను కలిపి పూర్తి సెమీకండక్టర్ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని వివరించారు.

మిషన్ 2.0కు భారీగా నిధులు

భారత్ సెమీకండక్టర్ మిషన్ 2.0 కింద ప్రభుత్వం కేటాయింపులను భారీగా పెంచిందని మోదీ తెలిపారు. మొదటి దశలో 8 బిలియన్ డాలర్లుగా ఉన్న కేటాయింపులను 13.5 బిలియన్ డాలర్లకు పెంచినట్లు చెప్పారు. సెమీకండక్టర్ పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన ప్రతి చర్యను ప్రభుత్వం తీసుకుంటోందన్నారు. దేశంలో సెమీకండక్టర్ రంగం ఎదగడం వల్ల పెట్టుబడులు పెరగడంతో పాటు



కొత్త కంపెనీలు, ఉద్యోగాలు, పరిశోధన అవకాశాలు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో కొన్ని ప్రాంతాలపై ఉన్న ఆధారాన్ని తగ్గించుకునే ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో భారత్‌కు ఇది ఒక పెద్ద అవకాశంగా మారుతుందని చెప్పారు.

15 రోజుల్లోనే!

భారత్ ఎంత వేగంగా అభివృద్ధి చెందుతోందో గత 15 రోజుల పరిణామాలను చూస్తే అర్థమవుతుందని మోదీ అన్నారు. సెప్టెంబర్‌లో ముంబయిలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ జరిగిందని గుర్తుచేశారు. అక్కడ ఏజెంటిక్ ఏఐ, టోకనైజేషన్, క్వాంటం టెక్నాలజీల ద్వారా సమ్మిళిత ఆర్థిక సేవలపై చర్చ జరిగిందన్నారు. అదే సమయంలో దేశంలో సుమారు 3 వేల కిలోమీటర్ల డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. దీనివల్ల దేశవ్యాప్తంగా సరుకు రవాణా వేగం పెరుగుతుందని, లాజిస్టిక్స్ మరింత మెరుగవుతాయని తెలిపారు. మెరుగైన రవాణా వ్యవస్థ తయారీ రంగానికి మరింత బలాన్ని ఇస్తుందని మోదీ చెప్పారు.

ఆర్థిక వృద్ధి- ప్రపంచ నమ్మకం

భారత్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తోందని ప్రధాని అన్నారు. అదే సమయంలో ప్రపంచ దేశాలకు భారత్‌పై ఉన్న విశ్వాసం కూడా పెరుగుతోందని చెప్పారు. ప్రస్తుత సవాళ్ల మధ్య కూడా దేశం తొలి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధిని నమోదు చేసిందని పేర్కొన్నారు. జపాన్‌కు చెందిన రేటింగ్ సంస్థ జేసీఆర్ఏ భారత్ రేటింగ్‌ను పెంచిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. భారత్‌లో తయారీ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రపంచ సరఫరా వ్యవస్థలో కీలక భాగస్వామిగా ఎదగడానికి సెమీకండక్టర్ రంగం ఉపయోగపడుతుందని మోదీ తెలిపారు.

కేసీఆర్, కుటుంబ ఆస్తులపై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు.. తీవ్రంగా స్పందించిన కేటీఆర్

మొదటి పేజి తరువాయి

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ ఆస్తులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. కేసీఆర్‌కు 1,000 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ ముఖ్యమంత్రి విషప్రచారం చేస్తున్నారని, ఇందుకు ఆయన తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్‌కు ఉన్నది 1,000 ఎకరాలు కాదని, కేవలం 67 ఎకరాలు మాత్రమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రే అసెంబ్లీ వేదికగా అంగీకరించారని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ముఖ్యమంత్రికి ఓ సవాల్ విసిరారు. "కేసీఆర్ పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు మా కుటుంబం ఆస్తులపై పూర్తిస్థాయి విచారణకు మేము సిద్ధం. మరి పుట్టినప్పటి నుంచి మీ ఆస్తులపై విచారణకు మీరు సిద్ధమా?" అని రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్ వ్యవసాయాన్ని ప్రేమించే నిజమైన రైతు అని, ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ ఆయన సాగు చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. కొందరు భూమిని ఒక వ్యాపార వస్తువుగా చూస్తే, కేసీఆర్ మాత్రం దానిని ఎంతో పవిత్రంగా భావిస్తారని పేర్కొన్నారు. చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూములపై అనవసర రాద్ధాంతం చేస్తూ రేవంత్ రెడ్డి 'సెల్ఫ్ గోల్' చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు. కేసీఆర్ తండ్రికి వందల ఎకరాల ఆస్తి ఉండేదని, చింతమడకలోని తమ పాత ఇంటిని ప్రభుత్వ పాఠశాల కోసం విరాళంగా ఇచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. 22ఏ బాధితులకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు



ఎండగడతామని ఆయన పునరుద్ఘాటించారు.

21వేల పానీపూరీలతో 13 అడుగుల గణేశుడి విగ్రహం తయారీ

మొదటి పేజి తరువాయి

పానీపూరీలతో భారీ గణపతి- వైరల్ అవుతున్న వినూత్న విగ్రహం వీడియో రెండు నెలల పాటు శ్రమించి గణేశుడి విగ్రహానికి ప్రాణం పోసిన కళాకారులు

ఢిల్లీ : దేశవ్యాప్తంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ప్రతి ఏటా ఈ నవరాత్రుల్లో భక్తులు తమ భక్తికి సృజనాత్మకతను జోడించి వినూత్న రీతిలో భారీ గణనాథుడి విగ్రహాలను ప్రతిష్ఠించడాన్ని మనం చూస్తుంటాం. ఈ ఏడాది కూడా మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. వీటిలో పుణెలో కొలువుదీరిన 'పానీపూరీ గణపతి' విగ్రహం ఒకటి. ఈ పానీపూరీ గణనాథుడ్ని చూసేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. అందుకే ఈ స్టోరీలో ఈ భిన్నమైన విగ్రహ తయారీకి ఎన్ని పానీపూరీలను వాడారు? ఆ విగ్రహం ఎత్తు ఎంత? దాన్ని ఎవరు తయారుచేశారు? తదితర విషయాలు తెలుసుకుందాం.

రెండు నెలలు శ్రమించి

పుణెలోని ఫెర్గూసన్ కాలేజ్ రోడ్డులో ఉన్న 'గణేశ్ భేల్' షాపు యజమానులైన రూపేశ్, దినేశ్ గుద్మేవార్ (ఇద్దరు సోదరులు) ఈ వినూత్న బొజ్జ గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 21,000 పానీపూరీలను ఉపయోగించి 13 అడుగుల ఎత్తైన విఘ్నేశ్వరుడి విగ్రహాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. ఇద్దరు సోదరులు రెండు నెలల పాటు శ్రమించి ఈ విగ్రహానికి అందమైన రూపానిచ్చారు. అంతేకాకుండా ఈ విగ్రహం పాడవకుండా ఉండేందుకు, దాని భద్రతను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఇద్దరు కళాకారులు నిరంతరం మండపం వద్దే ఉంటున్నారు. ఈ క్రమంలో ఈ పానీపూరీ గణపయ్యకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

సోదరుల అద్భుత కళాఖండం



స్వతహాగా కళాకారులైన రూపేశ్, దినేశ్ గుద్మేవార్‌లు తమ వ్యాపారానికి సంబంధించిన పదార్థాలను ఉపయోగించి గణపయ్యకు ఒక విలక్షణమైన రూపాన్ని ఎలా ఇవ్వొచ్చని ఆలోచించారు. అప్పుడే వారికి తమ వ్యాపారంలో ముఖ్య భాగమైన పానీపూరీలతో గణేశుడి విగ్రహాన్ని తీర్చిదిద్దాలనే ఆలోచన వచ్చింది. అయితే ఈ ఆలోచన వినడానికి సులభంగా అనిపించినా, దానిని ఆచరణలో పెట్టడం అంత సులభం కాదనే విషయాన్ని ఆ సోదరులు గ్రహించారు. ఎందుకంటే పానీపూరీలు తేలికగా ఉంటాయి. అలాగే తేమకు సులభంగా ప్రభావితమవుతాయి. అందుకే విగ్రహం ఆకృతికి, స్థిరత్వానికి భంగం కలగకుండా పానీపూరీలను ఎలా అమర్చవచ్చనే దానిపై ఆ సోదరులు సుమారు ఆరు నెలల పాటు చర్చించి, అధ్యయనం చేశారు. రెండు నెలల క్రితం విగ్రహం రూపకల్పన పనులు ప్రారంభించారు.

'పూజ, దర్శనం కోసం వేరే విగ్రహం ఏర్పాటు'

వెదురు, కాగితంతో చేసిన ఫ్రేమ్‌పై 13 అడుగుల గణపతి విగ్రహం రూపుదిద్దుకునే వరకు పానీపూరీలను ఒక్కొక్కటిగా అమర్చామని రూపేశ్ వివరించారు. ఈ పెద్ద విగ్రహాన్ని కేవలం కళాత్మక ప్రదర్శన కోసం మాత్రమే రూపొందించామని చెప్పారు. పూజ, దర్శనం కోసం దాని పక్కన ఒక చిన్న గణేశుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించామని వెల్లడించారు. అందువల్ల భక్తులు పానీపూరీలతో చేసిన గణేశుడి విగ్రహాన్ని సందర్శించి, పక్కనే ఉన్న చిన్న విగ్రహం వద్ద పూజలు చేస్తున్నారని స్పష్టం చేశారు. "పానీపూరీలతో చేసిన ఈ ప్రతిష్ఠాత్మక గణేశుడి విగ్రహాన్ని చెక్కుచెదరకుండా చూసుకోవడం అంత సులువైన పని కాదు. అందుకే 24 గంటలూ అప్రమత్తంగా ఉంటున్నాం. ఎందుకంటే గాలిలో తేమ వల్ల పానీపూరీలు మెత్తగా అయిపోతాయి. అలాగే దుమ్ము, ధూళి, తేమ వల్ల పాడైపోతాయి. అందుకే విగ్రహాన్ని పర్యవేక్షించడానికి, ఏవైనా సమస్యలు వస్తే వాటిని పరిష్కరించడానికి ఇద్దరు కళాకారులు మండపంలోనే ఉంటారు. పుణెలోని అనూహ్యమైన రుతుపవన వాతావరణం నుంచి ఈ భిన్నమైన విగ్రహాన్ని కాపాడటానికి అదనపు జాగ్రత్తలు కూడా తీసుకున్నాం" అని దినేశ్ స్పష్టం చేశారు.

సేంద్రియ ఎరువుగా మారనున్న పానీపూరీలు

గణేశ్ నవరాత్రుల తర్వాత ఈ పానీపూరీ గణేశుడి విగ్రహాన్ని నిమజ్జనం చేయమని సోదరులిద్దరూ (రూపేశ్, దినేశ్) చెప్పారు. అనంత చతుర్దశి తర్వాత అందరిలా ఈ విగ్రహాన్ని నీటిలో నిమజ్జనం చేయమని స్పష్టం చేశారు. అందుకు బదులుగా విగ్రహ తయారీలో వాడిన 21,000 పానీపూరీలను సేంద్రియ ఎరువుల తయారీకి ఉపయోగిస్తామని అన్నారు. ఆహార పదార్థాలు జలాశయాల్లోకి చేరకుండా నివారించడం, అలాగే ఈ వేడుకను పర్యావరణహితంగా జరుపుకోవాలనే సందేశాన్ని ఇవ్వడం కోసం తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

సామాన్యుడి గళం
విజన్‌పక్షం
PRGI.TGBIL/26/A0206

శుక్రవారం
18-09-2026

కవ్వగూడ అభివృద్ధికి రూ.3.30 కోట్లతో డబుల్ రోడ్డు



శంషాబాద్, సెప్టెంబర్ 17, విజన్ పక్షం:
శంషాబాద్ మండల పరిధిలోని కవ్వగూడ గ్రామ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. గ్రామ సర్పంచ్ కుక్కల ఇందిరమ్మ అధ్యక్షతన నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ పాల్గొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా శంషాబాద్ దొడ్డి నుంచి కవ్వగూడ గ్రామం వరకు రూ.3.30 కోట్ల నిధులతో నిర్మించనున్న డబుల్ రోడ్డు పనులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తూ మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. నూతన డబుల్ రోడ్డు నిర్మాణంతో కవ్వగూడ గ్రామానికి రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. కవ్వగూడ గ్రామ ప్రజలు సమన్వయంతో ముందుకు సాగుతూ గ్రామ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా చేపట్టే అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కవ్వగూడ గ్రామ వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు రమేష్ యాదవ్, బాలు ముదిరాజ్, మాజీ జడ్పీటీసీ తన్వీరాజు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఓజోన్ పొరను కాపాడుదాం.. భూమిపై జీవాన్ని సంరక్షిద్దాం



రాజేంద్రనగర్, సెప్టెంబర్ 17, విజన్ పక్షం: ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శంషాబాద్ రాజేంద్ర నగర్ లో రసాయన శాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం, క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా క్విజ్‌లో పాల్గొనడంతో పాటు ఓజోన్ పొర ప్రాముఖ్యత, క్షీణతకు కారణాలు, పర్యావరణంపై దాని ప్రభావాలు, పరిరక్షణ చర్యలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. హిమబిందు మాట్లాడుతూ "ఓజోన్ పొరను కాపాడుదాం––భూమిపై జీవాన్ని సంరక్షిద్దాం" అనే సందేశంతో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. సుస్థిర జీవన విధానాలను పాటిస్తూ పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు విద్యార్థులు ప్రజల్లో అవగాహన కల్పించడంలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఎస్.డి. భవాని ఓజోన్ పొర శాస్త్రీయ ప్రాముఖ్యతను వివరించారు. సూర్యుడి నుంచి వచ్చే హానికరమైన అతినీలలోహిత కిరణాల నుంచి భూమిపై జీవరాశులను రక్షించడంలో ఓజోన్ పొర కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఓజోన్ పరిరక్షణకు అవసరమైన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా. ఎం. సత్యనారాయణ, డా. ఎస్. రవీందర్ రెడ్డితో పాటు ఇతర అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

ఏసీబీ వలలో కీసర సీఐ, ఎస్సై!

రూ.10 లక్షల లంచం డిమాండ్.. రూ.5 లక్షలు తీసుకుంటుండగా ఎస్సై పట్టివేత
బెయిల్ కోసం నిందితుడిపై ఒత్తిడి.. సీఐ ఆంజనేయులు, ఎస్సై జ్ఞానేందర్‌రెడ్డి అరెస్ట్



కీసర, సెప్టెంబర్ 17 (విజన్ పక్షం):
మేడ్చల్––మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏసీబీ అధికారులు నిర్వహించిన ఆకస్మిక దాడులు కలకలం రేపాయి. లంచం తీసుకున్నారనే ఆరోపణలపై కీసర సీఐ ఆంజనేయులు, ఎస్సై జ్ఞానేందర్‌రెడ్డిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం.. ఓ కేసులో నిందితుడికి బెయిల్ ఇప్పించే విషయంలో సీఐ రూ.10 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా నిందితుడిపై ఒత్తిడి తెస్తూ కొన్ని రోజుల పాటు బిర్యానీలు, కూల్‌డ్రింక్స్ తదితరాలు తీసుకురావాలని వేధించినట్లు ఫిర్యాదు అందింది. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు సమాచారం.లంచం మొత్తాన్ని స్వీకరించే బాధ్యతను సీఐ.. ఎస్సై జ్ఞానేందర్‌రెడ్డికి అప్పగించినట్లు ఏసీబీ అధికారులు గుర్తించినట్లు తెలిసింది. దీంతో డీఎస్పీ మజీద్ అలీఖాన్ ఆధ్వర్యంలో ఏసీబీ బృందం రంగంలోకి దిగింది.కీసర చెరువు గట్టు వద్ద వినాయక నిమజ్జనం బందోబస్తు విధుల్లో ఉన్న ఎస్సై జ్ఞానేందర్‌రెడ్డి రూ.5 లక్షల లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసినట్లు సమాచారం. అధికారులు రావడాన్ని గమనించిన ఎస్సై అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది.ఏసీబీ అధికారులు నిర్వహించిన రసాయన పరీక్షలకు తొలుత సహకరించకుండా ఎస్సై ఇబ్బందులకు గురిచేసినట్లు సమాచారం. అనంతరం సీఐ ఆంజనేయులు, ఎస్సై జ్ఞానేందర్‌రెడ్డిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసినట్లు తెలిసింది.ఈ ఘటనతో కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో తీవ్ర చర్చకు దారితీసింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను ఏసీబీ అధికారులు వెల్లడించాల్సి ఉంది.

నర్కూడలో ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



శంషాబాద్, సెప్టెంబర్ 17, విజన్ పక్షం:
శంషాబాద్ మండల పరిధిలోని నర్కూడ గ్రామంలో శ్రీ భగవాన్ విశ్వకర్మ జయంతి మహోత్సవాలను విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు పెద్దోజు మాధవాచారి ఆధ్వర్యంలో శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి విశ్వకర్మ భగవానుడిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. అనంతరం విశ్వకర్మ సంఘం సభ్యులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ భగవానుడి సేవలను స్మరించుకుంటూ, సమాజ నిర్మాణంలో విశ్వకర్మ వర్గాలకు చెందిన వృత్తి నిపుణులు అందిస్తున్న సేవలను కొనియాడారు. సంప్రదాయ వృత్తి నైపుణ్యాలను కాపాడుకుంటూ, యువత వాటిని కొనసాగించాలని పలువురు సూచించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు కమ్మరి ప్రకాష్ చారి, పెద్దోజు సుదర్శన్ చారి, పెద్దోజు శ్రీశైలం చారి, కమ్మరి నరసింహ చారి, కుమ్మరి నరసింహ చారి, కమ్మరి శ్రీధర్ చారి, కుమ్మరి రాజు చారి, కమ్మరి ప్రభు చారి, జంగా చారి, కార్తీక్ చారి, సిద్ధులు చారి, గౌతమ్ చారి, ప్రవీణ్ చారి, రాము చారితో పాటు కమిటీ సభ్యులు, సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అండగా కందకట్ల సిద్దు రెడ్డి



శంషాబాద్, సెప్టెంబర్ 17, విజన్ పక్షం: ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఆర్థిక, వైద్య భద్రత కల్పించేందుకు ప్రముఖ సామాజికవేత్త కందకట్ల సిద్దు రెడ్డి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా 300 మంది ఆటో డ్రైవర్లకు రూ.3 లక్షల చొప్పున హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం కోసం సుమారు రూ.కోటి వరకు వ్యయం చేయనున్నట్లు, మూడు రోజుల్లోనే బీమా ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అవసరమైన సందర్భాల్లో ఆరోగ్య బీమాను పలుమార్లు వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ప్రమాదవశాత్తు ఆటో డ్రైవర్ మృతి చెందితే, వారి కుటుంబానికి రూ.10.50 లక్షల ఆర్థిక సహాయం అందించనున్నట్లు ప్రకటించారు. ఆటో డ్రైవర్లు నిత్యం ప్రజలకు సేవలందిస్తూ తమ కుటుంబాలను పోషిస్తున్నారని, వారి కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సిద్దు రెడ్డి పేర్కొన్నారు. "మీరు ఒంటరిగా లేరు" అనే భరోసా కల్పించడమే తన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సెప్టెంబర్ 18న శంషాబాద్‌లోని మల్లిక గార్డెన్స్‌లో ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ఆటో డ్రైవర్లు, సామాజిక సేవా కార్యకర్తలు, స్థానికులు హాజరుకానున్నారు.

ములుగు జిల్లా ఇంచార్జ్‌గా చింతల రాఘవేందర్ ముదిరాజ్ నియామకం



ములుగు, సెప్టెంబర్ 17, విజన్ పక్షం:
బీజేవైఎం రాష్ట్రవ్యాప్తంగా సంస్థాగత బలోపేతం కోసం చేపడుతున్న జిల్లాల ఇంచార్జుల నియామకాల్లో భాగంగా, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతల రాఘవేందర్ ముదిరాజ్‌ను ములుగు జిల్లా ఇంచార్జ్‌గా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు గణేష్ కుందే ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా చింతల రాఘవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు గణేష్ కుందేకు, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ములుగు జిల్లాలో బీజేవైఎంను గ్రామస్థాయి వరకు బలోపేతం చేసి, యువత సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని ఆయన అన్నారు. "ఫీజు బకాయి –– బీజేపీ లడాయి" వంటి కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా విస్తరిస్తామని పేర్కొన్నారు.యువతను బీజేపీ వైపు ఆకర్షించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని చింతల రాఘవేందర్ ముదిరాజ్ తెలిపారు.

మోదీ జన్మదిన వేడుకల్లో సేవా స్ఫూర్తి

షాద్‌నగర్‌లో ఘనంగా మెగా రక్తదాన శిబిరం



షాద్‌నగర్, సెప్టెంబర్ 17 (విజన్ పక్షం): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని షాద్‌నగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉమ్మడి పాలమూరు జిల్లా ఎంపీ డీకే అరుణ ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడే సేవలో భాగస్వాములు కావడం అభినందనీయమని డీకే అరుణ పేర్కొన్నారు.అనంతరం ఎం.ఎన్.టి. ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రి, హైదరాబాద్ ప్రతినిధులు రక్తదాతలకు డీకే అరుణ చేతుల మీదుగా ధ్రువపత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో రక్తదాతలు సుందరాపూరం అంజిరెడ్డి, మనోహర్ గౌడ్, ఇస్నాతి శ్రీనివాస్, వంశీకృష్ణ, చెట్ల వెంకటేష్, పసుల నరసింహ యాదవ్, మురళి, మోహన్ సింగ్, మిద్దె గణేష్, కంచుకోట మహేష్, కరెడ్ల నరేందర్ రెడ్డి, అత్తాపురం మహేందర్ రెడ్డి, ఏ.అనిల్ గౌడ్, పవన్ కుమార్ రెడ్డి, క్యామ మహేష్, రాజేశ్వరి, మఠం రిషికేశ్, లస్కర్ నాయక్,



పద్మ సాయిరాం, కృష్ణ యాదవ్, సుధాకర్ అప్ప, పద్మ కృష్ణయ్య, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత ఉత్సాహంగా పాల్గొనడంతో రక్తదాన శిబిరం సందడిగా సాగింది.

ప్రజాపాలనతోనే తెలంగాణ అభివృద్ధి

చేవెళ్లలో ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు
జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య



చేవెళ్ల, సెప్టెంబర్ 17 (విజన్ పక్షం): తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని చేవెళ్ల మున్సిపాలిటీ కార్యాలయం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కేంద్రంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో చేవెళ్ల ఎమ్మెల్యే శ్రీ కాలే యాదయ్య పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, పోరాటాలు, త్యాగాల ఫలితంగా రాష్ట్రం ఏర్పడిందని, ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు పారదర్శకంగా అందేలా కృషి చేయాలని సూచించారు.తెలంగాణ రాష్ట్ర ప్రగతిలో రైతులు, కార్మికులు, యువత, మహిళలు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని పేర్కొంటూ ప్రజాపాలన మరింత బలోపేతం కావాలంటే ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.అనంతరం ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సహకార సంఘం ప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బీసీల రాజ్యాధికార పాదయాత్రకు తరలిరావాలి

బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్కే కృష్ణ యాదవ్ పిలుపు
సామాజిక సమానత్వం కోసం 14,500 కి.మీ. పాదయాత్రకు సంఘీభావం

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (విజన్ పక్షం):
బీసీలకు రాజ్యాధికారం, సామాజిక సమానత్వం, రాజకీయ ప్రాతినిధ్యం సాధించడమే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ చేపట్టిన 14,500 కిలోమీటర్ల రాజ్యాధికార పాదయాత్రకు బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్కే కృష్ణ యాదవ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గురువారం హైదరాబాద్‌లోని గోల్కొండ నుంచి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా బర్కే కృష్ణ యాదవ్ ఆయనను శాలువాతో సత్కరించి పాదయాత్రకు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా బర్కే కృష్ణ యాదవ్ మాట్లాడుతూ.. బీసీలకు రాజ్యాధికారం, సామాజిక న్యాయం, సమానత్వం కోసం సుదీర్ఘ పాదయాత్రకు శ్రీకారం చుట్టిన తీన్మార్ మల్లన్నను అభినందించారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు పెద్ద సంఖ్యలో పాదయాత్రలో పాల్గొని మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు గణనీయమైన జనాభా ఉన్నప్పటికీ, జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం, అధికారంలో భాగస్వామ్యం దక్కడం లేదని ఆయన పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన అన్ని సామాజిక వర్గాలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు వచ్చి తమ హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం కోసం చైతన్యవంతం కావాలని కృష్ణ యాదవ్ కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రతి సామాజిక వర్గానికి సముచిత భాగస్వామ్యం ఉండేలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా సామాజిక, రాజకీయ రంగాల్లో సమాన ప్రాతినిధ్యం కోసం ఇంకా ఉద్యమాలు కొనసాగాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీ వర్గాల్లో రాజకీయ చైతన్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు.బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం, అధికారంలో భాగస్వామ్యం లభించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని బర్కే కృష్ణ యాదవ్ స్పష్టం చేశారు. తీన్మార్ మల్లన్న చేపట్టిన రాజ్యాధికార పాదయాత్రకు బీసీ సేన అండగా ఉంటుందని తెలిపారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజలు ఐక్యతతో ముందుకు సాగి సామాజిక న్యాయం, సమానత్వం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి



కుత్బుల్లాపూర్,సెప్టెంబర్17(విజన్ పక్షం దినపత్రిక) కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జీడిమెట్ల డివిజన్ పరిధి జీడిమెట్ల గ్రామం లో బ్రహ్మంగారి గుట్ట వద్ద శ్రీ శ్రీ శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రాహ్మేశ్వరస్వామి వారి ఆలయం లో శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు విచ్చేసిన మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి మహాయజ్ఞ మహోత్సవం లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమం లో కృష్ణమా చారీ,సంతోష్ చారీ,వెంకటేష్ చారీ,శేఖర్ చారీ,రాజేష్ చారీ,నార్లకంటి దుర్గయ్య,నార్లకంటి ప్రతాప్,నల్లనాగుల్ కృష్ణ,సతీష్ చక్రవర్తి,నాగదీప్ గౌడ్,పాపయ్య దొర,మహేష్,వర్మ,శివ,హేమంత్,వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

ఇందిరమ్మ ఇళ్లతో పేద కుటుంబాలకు భరోసా- పామెన భీమ్ భరత్



రంగారెడ్డి జిల్లా, సెప్టెంబర్ 17 (విజన్ పక్షం):
పేదల సొంతింటి కలను సాకారం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామెన భీమ్ భరత్ అన్నారు.చేవెళ్ల మండలం దుద్దాగు గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తికావడంతో నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, నూతన గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులను అభినందించారు.భీమ్ భరత్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి కల సాకారమవుతుండటం సంతోషకరమన్నారు. ఇల్లు పూర్తిచేసుకుని లబ్ధిదారులు నూతన గృహంలోకి అడుగుపెట్టడం ఆనందంగా ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చేవెళ్ల నియోజకవర్గ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు.అనంతరం చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని శ్రీ శ్రీ వినాయక మండపాన్ని సందర్శించిన భీమ్ భరత్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.నవాబుపేట మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు కందాడ గోవింద్ రెడ్డి మనుమరాలు, మనుమడు పుట్టు దోతుల శుభకార్యానికి భీమ్ భరత్ హాజరై చిన్నారులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చేవెళ్ల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి, మొయినాబాద్ మండల మాజీ అధ్యక్షులు మానయ్య, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు నవీన్, రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ మాణిక్యం, అశోక్, మహేందర్, నర్సింలు, విజయ్, నవాబుపేట మండల అధ్యక్షులు సామ వెంకట్ రెడ్డి, మాజీ అధ్యక్షులు వెంకటయ్య, సామ సంజీవ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు ఉపేందర్ రెడ్డి, ఎల్లకొండ సర్పంచ్ కొండల్ యాదవ్, తిమ్మారెడ్డిపల్లి సర్పంచ్ ప్రభాకర్, పులుమామిడి సర్పంచ్ నర్సింలు, చించల్‌పేట్ సర్పంచ్ అనంత రాములు, ఎల్లకొండ ఉపసర్పంచ్ రామ్ చందర్, శివ, కుమ్మరిగూడ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ గోపాల్ కృష్ణ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ టవర్స్ జంక్షన్‌లో ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి

రద్దీ ప్రాంతాలను గుర్తించి.. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు వేగవంతం



హైదరాబాద్, సెప్టెంబర్ 17 (విజన్ పక్షం):
సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీ సన్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్ సైబర్ టవర్స్ జంక్షన్‌ను సందర్శించి అక్కడి ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించారు. ఆయన వెంట డీసీపీ ట్రాఫిక్–1, అదనపు డీసీపీ ట్రాఫిక్, మాదాపూర్ ఏసీపీతో పాటు సీనియర్ ట్రాఫిక్ పోలీసు అధికారులు ఉన్నారు.ట్రాఫిక్ మానిటరింగ్ ట్యాబ్ ద్వారా జంక్షన్‌లో వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ రద్దీని రియల్‌టైమ్‌లో పరిశీలించిన అధికారులు, రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలను గుర్తించారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం ఇప్పటికే అమలు చేస్తున్న చర్యలను సమీక్షించారు.రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని, అవసరమైన చోట సమర్థవంతమైన నియంత్రణ చర్యలు చేపట్టాలని జాయింట్ కమిషనర్ అధికారులను ఆదేశించారు.వాహనాల రాకపోకలు సాఫీగా, అంతరాయం లేకుండా సాగేందుకు అవసరమైన చర్యలను సమన్వయంతో చేపట్టాలని సూచించారు.

కేజీబీవీ లో అతిథి ఉపాధ్యాయుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం




మొయినాబాద్: 17 సెప్టెంబర్ (విజన్ పక్షం)
విద్యార్థులకు విద్యాబోధన చేయడానికి అతిథి అధ్యాపకులు, ఉపాధ్యాయుల పోస్టుల ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి హరిష గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని ఖాసింభౌలి గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన నజీబ్ నగర్ గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో ఆరవ తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు సాంఘిక శాస్త్రంలో విద్యాబోధన చేయడానికి కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ (అతిథి ఉపాధ్యాయులుగా) గా పని చేయడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు డిగ్రీతో పాటు బీఈడీ విద్యార్హత కలిగి ఉండాలని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత ఎంపికైన అభ్యర్థులకు నెలసరి వేతనం రు. 18 వేల రూపాయలు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. అదే విధంగా ఇంటర్ విద్యార్థులకు(ఒకేషనల్ కోర్స్) విద్యాబోధన చేయడానికి బీఎస్సీ నర్సింగ్ చదివిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం ఉందని చెప్పారు. వారికి నెలసరి వేతనంరూ.23 వేలు చెల్లించడం జరుగుతుందని అన్నారు. విద్యా బోధనతో పాటు రాత్రి సమయంలో స్టడీ అవర్స్ లో కూడా విధులు నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 21వ తేదీ లోపు విద్యాలయానికి తమ విద్యార్హతల సర్టిఫికెట్లతోపాటు వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్

ఆదిభట్ల, 17 సెప్టెంబర్ (విజన్ పక్షం)
రంగారెడ్డి జిల్లా, నాదర్‌గుల్ శ్రీపురం కాలనీలో జరిగిన మహిళ హత్య కేసులో నిందితుడిని ఆదిభట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 15న నాదర్‌గుల్ శ్రీపురం కాలనీలో మహిళ మృతి చెందిన ఘటనపై ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలిని కొర్రపాటి కళ్యాణిగా గుర్తించారు. ఆమెతో సహజీవనం చేస్తున్న దాసరి నరసింహ మూర్తి (35)తో మద్యం సేవించే విషయంలో తరచూ గొడవలు జరిగేవని దర్యాప్తులో వెల్లడైంది.ఈ క్రమంలో సెప్టెంబర్ 13న రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరగగా, నరసింహ మూర్తి కళ్యాణి మెడకు నైలాన్ తాడు బిగించి ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.అనంతరం హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు సంఘటనా స్థలంలోని ఆధారాలను మార్చే ప్రయత్నం చేసినట్లు, మృతురాలి ఫోన్ నుంచి ఆమె భర్తతో పాటు ఇతరులకు తప్పుడు సమాచారం పంపినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారైనట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడు దాసరి నరసింహ మూర్తిని గురువారం ఉదయం 11 గంటలకు నాదర్‌గుల్‌లో ఆదిభట్ల ఎస్‌హెచ్‌ఓ ఎస్. రమేశ్ తన సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. అనంతరం నిందితుడిని న్యాయపరమైన చర్యల నిమిత్తం రిమాండ్‌కు తరలించారు.నిందితుడిని చాకచక్యంగా పట్టుకోవడంలో కీలకంగా పనిచేసిన ఆదిభట్ల ఎస్‌హెచ్‌ఓ ఎస్. రమేశ్, సబ్‌ఇన్‌స్పెక్టర్లు డి. వెంకటేశ్, ఎన్. నోయల్ రాజ్‌తో పాటు క్రైమ్ సిబ్బంది పి. ఎల్లయ్య, సంతోష్ కుమార్, ఎం.డి. సంతోష్, శివచంద్ర, సందీప్, టి. ఉపేందర్ రెడ్డిలను డీసీపీ శంషాబాద్ అభినందించారు.

హాలీవుడ్ గడప తొక్కుతున్న 'మహారాజ'



ఒకప్పుడు హాలీవుడ్, బాలీవుడ్ సినిమాలు సౌత్‌లో రీమేక్ అయ్యేవి. కానీ ఇప్పుడు సీన్ పూర్తిగా మారిపోయింది. మన కథల్లోని కంటెంట్ నచ్చితే.. వాటిని ఇతర భాషల్లోకి తీసుకెళ్లేందుకు మేకర్స్ ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా సౌత్ సినిమాలు బాలీవుడ్‌తో పాటు అంతర్జాతీయ స్థాయిలోనూ సత్తా చాటుతున్నాయి. ఇప్పుడు మరో తమిళ సినిమా హాలీవుడ్ గడప తొక్కేందుకు సిద్ధమైంది. విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలో నటించిన 'మహారాజ' చిత్రం హాలీవుడ్‌లో రీమేక్ కానుంది. నిథిలన్ స్వామినాథన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'మహారాజ' చిత్రం 2024లో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విజయ్ సేతుపతి తనదైన నటనతో మెప్పించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకోవడంతో పాటు ఆయన కెరీర్‌లో ప్రత్యేక చిత్రంగా నిలిచింది. ఇప్పటికే ఈ సినిమాను హాలీవుడ్‌లో రీమేక్ చేయనున్నారంటూ కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. తాజాగా వాటికి తెరదించుతూ ప్రముఖ హాలీవుడ్ నిర్మాణ సంస్థ 'ప్యాషన్ స్టూడియోస్' అధికారికంగా ఈ రీమేక్‌ను ప్రకటించింది. 'మహారాజ'ను హాలీవుడ్‌లో రీమేక్ చేయడం తమకు ప్రత్యేకమైన మైలురాయిగా పేర్కొన్న నిర్మాణ సంస్థ.. హాలీవుడ్‌లో రీమేక్ కానున్న తొలి తమిళ చిత్రంగా ఇది నిలుస్తుందని వెల్లడించింది. దీంతో తమిళ సినిమా మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. అయితే హాలీవుడ్ వెర్షన్‌కు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా వెల్లడించలేదు.ఇక ఈ రీమేక్‌లో విజయ్ సేతుపతి పోషించిన పాత్రను ఆస్కార్ అవార్డు అందుకున్న ఓ స్టార్ హీరో నటించనున్నట్లు ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా 'మాథ్యూ' అనే హాలీవుడ్ స్టార్ పేరు వినిపిస్తోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాలేదు. త్వరలోనే హాలీవుడ్ రీమేక్‌లో నటించబోయే నటీనటులు, దర్శకుడు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను వెల్లడించే అవకాశం ఉంది.


కాగా.. విజయ్ సేతుపతి 50వ చిత్రంగా 'మహారాజ' ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సినిమాలో ఆయన నటనకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడంతో పాటు పలు అవార్డులు కూడా దక్కాయి. తమిళంతో పాటు తెలుగు భాషలోనూ ఈ చిత్రం మంచి ఆదరణ సొంతం చేసుకుంది. అంతేకాదు.. చైనాలో విడుదలైన తర్వాత అక్కడ కూడా ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడం విశేషం. ఇప్పటికే 'మహారాజ' కథ, విజయ్ సేతుపతి నటనకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించగా.. ఇప్పుడు ఏకంగా హాలీవుడ్ రీమేక్‌కు రంగం సిద్ధం కావడం సినీ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. హాలీవుడ్ నటీనటులతో ఈ కథను ఎలా తెరకెక్కిస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

తల్లి కాబోతున్న సమంత.. ఇష్టమైన ఆహారాలు ఇవే!

తల్లి కాబోతున్న ఆనందంలో ఉన్నారు స్టార్ హీరోయిన్ సమంత గర్భధారణ సమయంలో తాను ఇష్టంగా తీసుకుంటున్న ఆహార పదార్థాల గురించి తాజాగా అభిమానులతో ఆమె పంచుకున్నారు. తనకు దక్షిణాది సంప్రదాయ వంటకాలంటే ఎంతో ఇష్టమని వెల్లడించారు.

సోనీ విళ పంచుకున్న ఓ పోస్ట్‌లో.. జీవితాంతం ఒకే రకమైన ఆహారం తినాల్సి వస్తే ఏం ఎంచుకుంటారు? అని సమంతను అడగ్గా, ఉదయం అల్పాహారంగా ఇడ్లీ, మధ్యాహ్నం భోజనంలో పెరుగన్నం, రాత్రికి దోశ తినేందుకు ఇష్టపడతానని ఆమె బదులిచ్చారు. ''ప్రస్తుతం గర్భంతో ఉన్నందున నాకెక్కువగా ఇవే తినాలనిపిస్తోంది. భవిష్యత్తులో నా ఇష్టాలు మారొచ్చు'' అని ఆమె సరదాగా చెప్పుకొచ్చారు.

ఇక, సమంత గతేడాది దర్శక-నిర్మాత రాజ్ నిడిమోరును కోయంబత్తూరులోని ఈషా యోగా కేంద్రంలో వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇటీవల సీమంతం వేడుక కూడా సంప్రదాయబద్ధంగా జరిగింది. కాగా, గత జూన్‌లో.. ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన 'మా ఇంటి బంగారం' సినిమా సక్సెస్ మీట్‌లో తాను తల్లి కాబోతున్న విషయాన్ని సమంత అధికారికంగా ప్రకటించారు. చేతిలో ఉన్న ప్రాజెక్టులు పూర్తయ్యాక సినిమాల నుంచి చిన్న విరామం తీసుకోనున్నట్లు ఆమె అప్పట్లోనే వెల్లడించారు. ప్రస్తుతం సమంత 'సెలబ్రిటీ మాస్టర్ చెఫ్ తమిళం' కార్యక్రమానికి హోస్ట్‌గా వ్యవహరిస్తుండగా.. రాజ్ & డీకే తెరకెక్కించే భవిష్యత్ ప్రాజెక్టుల్లోనూ ఆమె భాగం కానున్నట్లు తెలుస్తోంది.



'ఎల్లమ్మ' సినిమాలో అనంతిక!

సంచలన విజయం సాధించిన 'బలగం' సినిమా తర్వాత టాలెంటెడ్ డైరెక్టర్ వేణు యెల్దండి తెరకెక్కిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక భారీ ప్రాజెక్ట్ 'ఎల్లమ్మ'. ఈ సినిమాకు సంబంధించి ఇప్పటికే టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొనగా, మరో ఆసక్తికరమైన విశేషం ఏంటంటే.. కోట్లాది మంది సంగీత అభిమానులను తన ట్యూన్స్‌తో ఊర్రూతలూగిస్తున్న రాక్ స్టార్ దేవిశ్రీప్రసాద్ ఈ చిత్రంతో హీరోగా సిల్వర్ స్క్రీన్‌కు పరిచయం కాబోతున్నారు. నటుడిగా మారుతూనే ఈ సినిమాకు ఆయనే స్వయంగా సంగీతం కూడా అందిస్తుండటం విశేషం. ఇలాంటి క్రేజీ ప్రాజెక్ట్‌ను టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు, శిరీష అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇక ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం మొదట్లో సాయిపల్లవి, కీర్తి సురేష్, మృణాల్ ఠాకూర్, భాగ్యశ్రీ బోర్సే, రుక్మిణి వసంత్ వంటి పలువురు స్టార్ హీరోయిన్ల పేర్లు వినిపించాయి.తాజా సమాచారం ప్రకారం.. ఈ చిత్రంలో హీరోయిన్‌గా యంగ్ బ్యూటీ అనంతిక సనిల్ కుమార్‌ను మేకర్స్ దాదాపు ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. 'మ్యాడ్', '8 వసంతాలు' వంటి వైవిధ్యమైన చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో ప్రత్యేకంగా గూడుకట్టుకున్న ఈ టాలెంటెడ్ భామ, ఇటీవల 'రొమాంచకం' సినిమాతో కూడా ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు ఏకంగా వేణు యెల్దండి దర్శకత్వంలో వస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌లో ఛాన్స్ కొట్టేయడంతో ఈ వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌లో అనంతిక కూడా జాయిన్ కాబోతున్నట్లు సమాచారం. అయితే దీనికి సంబంధించి మేకర్స్ నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.



శ్రీదేవి ఆస్తి వివాదం

దివంగత నటి శ్రీదేవి చెన్నె ఆస్తి వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. తాజాగా ఆ వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. చెన్నె ఈస్ట్ కోస్ట్ రోడ్డులో ఉన్న ఈ స్థలంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన సర్వోన్నత న్యాయస్థానం.. తదుపరి విచారణ వరకు అక్కడ యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని ఆదేశించింది. ఆస్తి వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఇరువర్గాలకు సూచించింది. శ్రీదేవి 1988లో చెన్నె ఈస్ట్ కోస్ట్ రోడ్డులో 4.77 ఎకరాల స్థలాన్ని ముదలియార్ అనే వ్యక్తి కుటుంబం నుంచి కొనుగోలు చేశారు. దశాబ్దాలుగా ఇది శ్రీదేవి కుటుంబం ఆధీనంలోనే ఉంది. శ్రీదేవి మరణానంతరం 2023లో ఆస్తి మార్పిడి కోసం దరఖాస్తు చేసుకోగా.. ముదలియార్ రెండో భార్య పిల్లలైన ఎం.సి. శివగామి, ఆమె సోదరుడు ఈ ఆస్తిలో తమకూ వాటా ఉందంటూ చెంగల్పట్టు కోర్టులో సివిల్ కేసు వేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ శ్రీదేవి భర్త బోనీ కపూర్, కుమార్తెలు జాన్వీ, ఖుషీ కపూర్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. మొదటి భార్య ప్రాణాలతో ఉండగానే ముదలియార్ రెండో పెళ్లి చేసుకున్నారని, కాబట్టి రెండో భార్య పిల్లలకు చట్టపరంగా వారసత్వ హక్కులు ఉండవని వాదించారు. వారితో ఏకీభవించిన మద్రాస్ హైకోర్టు.. కింది కోర్టు తీర్పులో జోక్యం చేసుకుంటూ శివగామి వేసిన సివిల్ కేసును కొట్టివేసింది. మద్రాస్ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ శివగామి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేసు ప్రాథమిక దశలో ఉండగానే హైకోర్టు లోతుగా విచారణ (మినీ-ట్రయల్) జరిపిందని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. కపూర్ కుటుంబం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. 1988లో జరిగిన కొనుగోలుపై ఇన్నేళ్ల తర్వాత (2025లో) కేసు వేయడం సరికాదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పిటిషనర్లు 1995, 1999లోనే మేజర్లు అయ్యారని గుర్తుచేశారు. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం.. మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించింది. ఇందుకోసం ఓ విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తిని నియమిస్తామని తెలుపుతూ తదుపరి విచారణను డిసెంబర్ 18కి వాయిదా వేసింది.

బంధానికి 20 ఏళ్లు.. మరోసారి పెళ్లి..



తమిళ స్టార్ జంట సూర్యజ్యోతిక మళ్లీ పెళ్లి చేసుకున్నారు. 2006లో ప్రేమ వివాహం చేసుకున్న వీళ్లు.. ఇప్పుడు తమ బంధానికి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా క్రిస్టియన్ పద్ధతిలో పిల్లల సమక్షంలో ఉంగరాలు మార్చుకుని కొత్త జంటలా వివాహం చేసుకున్నారు. అనంతరం ఫొటోలకు పోజులిచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియోని జ్యోతిక తన ఇన్‌స్టాలో షేర్ చేసింది. 'ది సీక్వెల్ 20 ఏళ్ల ప్రేమకు మరో ప్రతిజ్ఞ' పేరుతో వీడియో షేర్ చేసిన జ్యోతిక తన మనసులోని మాటలకు అద్భుతమైన అక్షరరూపం ఇచ్చింది. '20 ఏళ్ల వైవాహిక బంధం.. ఎన్నో మధుర జ్ఞాపకాలు. చిన్న చిన్న మనస్పర్థలు. ఒకరినొకరు అర్థం చేసుకోవడం, సర్దుకుపోవడం, త్యాగాలు, మరీ ముఖ్యంగా ఎలాంటి అంచనాల్లేకుండా ఒకరినొకరు ప్రేమించుకోవడం. ఇది పరిపూర్ణమైన పెళ్లిని సెలబ్రేట్ చేసుకోవడం కాదు. ఒకరి కోసం మరొకరు మారుతూ, ఎదుగుతూ వచ్చిన మనం అనే బంధానికి ఇది ఓ వేడుక. ఒకప్పుడు కలలా అనిపించిన జీవితం.. ఇప్పుడు నా జీవితాంతం కలగనేంత అందమైన నిజంలా మారింది' 'ఇకపై నేను ఆనందంగా ఉండటానికి ప్రయత్నిస్తాను. జీవితంలో ఇబ్బందులు ఎదురైతే అందులోని పాజిటివిటీనే చూడాలని నిర్ణయించుకున్నాను. జీవితాన్ని ప్రతిరోజూ వేడుకలా సెలబ్రేట్ చేసుకుంటాను. ఇకపై ఎలాంటి ఫిర్యాదు చేయను. కృతజ్ఞతతో ఉంటాను. ఆరోగ్యాన్ని కాపాడుకుంటాను. మంచి తల్లిగా ఉండేందుకు ప్రయత్నిస్తాను' అని జ్యోతిక చెప్పుకొచ్చింది. తన భర్త సూర్య గురించి మాట్లాడుతూ.. 'నేను ఎప్పటికీ నీతో గొడవపడతాను. మళ్లీ నేనే వచ్చి మాట్లాడతాను. ప్రతి చిన్న గొడవ తర్వాత మన బంధం మరింత దగ్గరవుతుందని నమ్ముతాను. ఈ 20 ఏళ్ల ప్రయాణంలో అన్నింటికంటే విలువైనది మన స్నేహమే. ఓ వ్యక్తి నాతో సమానంగా, మనసులోని మాటలు చెప్పుకోగలిగే నమ్మకస్తుడిగా, గాసిప్ పార్ట్‌నర్‌గా, బెస్ట్ ఫ్రెండ్‌గా ఉండటం అరుదు. అలాంటి వ్యక్తే నా భర్తగా, నా పిల్లలకు తండ్రిగా నా జీవితంలో ఉండటం నేను చేసుకున్న అదృష్టం. ఇది 20 ఏళ్ల ప్రయాణానికి ముగింపు కాదు. మరో 20 ఏళ్లకు ఆరంభం' అని జ్యోతిక భావోద్వేగానికి గురైంది.

'బిర్యానీ' కోసం జుట్టు, గెడ్డం పెంచా: సంపూర్ణేష్ బాబు



''నేను ఇప్పటివరకూ చేసిన పాత్రలు ప్రేక్షకులను బాగా నవ్వించాయి. అయితే 'ది ప్యారడైజ్'లో చేసిన బిర్యానీ పాత్ర చాలా సీరియస్‌గా ఉంటుంది. ఈ క్యారెక్టర్ కోసం నేను వేరే ఏ సినిమాలు ఒప్పుకోలేదు. జుట్టు, గెడ్డం పెంచడంతో పాటు బరువు పెరిగి ప్రత్యేకంగా మేకోవర్ అయ్యాను. యాక్షన్ సీన్స్ కూడా చేశాను. నా కెరీర్‌లో బిర్యానీ పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుంది'' అని సంపూర్ణేష్ బాబు తెలిపారు. నాని, కయాదు లోహర్ జంటగా నటించిన చిత్రం 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మోహన్‌బాబు, సంపూర్ణేష్ బాబు కీలక పాత్రలు పోషించారు. ఎస్ఎల్‌వీ సినిమాస్ పై సుధాకర్ చెరుకూరి నిర్మించిన 'ది ప్యారడైజ్' మూవీ ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా సంపూర్ణేష్ బాబు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ- ''ఈ సినిమాలోని బిర్యానీ పాత్రకు లుక్ టెస్ట్ చేసి, సరిపోతానని నన్ను ఎంపిక చేశారు శ్రీకాంత్ ఓదెల. నానీగారి అనుచరుడిగా చాలా ప్రాధాన్యం ఉన్న పాత్రలో కనిపిస్తాను. ప్రస్తుతం హీరోగా ఓ సినిమా ఒప్పుకున్నాను. 'ది ప్యారడైజ్' తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మరిన్ని అవకాశాలు వస్తాయనే నమ్మకం ఉంది'' అని పేర్కొన్నారు.